క్లుప్తంగా

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: సువర్ణముఖి నదీ తీరాన మండల కేంద్రంలో వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానఅర్చకుడు పీసపాటి శ్రీనివా సాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు లక్ష్మీనృసింహ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించగా దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.ముడుపులు చెల్లించడానికి వచ్చిన భక్తులతో క్షీరాభిషేకాలు, కుంకుమపూజను అర్చకులు చేయించారు.

ఉపాధి పనులు వేగవంతం



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్

సాలూరు: ఉపాధి హామీ పథకం పనులు వేగవంతం చేయాలని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పార్వతి ఆధ్వర్యంలో ఉపాధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలవారీగా మంజూరైన పనులు, చేపడుతున్న పనుల ప్రగతిపై ఆరా తీశారు. అనంతరం వైస్ ఎంపీపీ మాట్లాడుతూ, వ్యవసాయ సంబంధిత పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం తగదన్నారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ రామకృష్ణ, టీఏలు, ఎఫ్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ



కరాటేలో ప్రతిభ కనభరిచిన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

కురుపాం: స్థానిక మహాలక్ష్మీ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి పువ్వల గిరి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో అండర్ - 19 విభాగం కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.కళ్యాణ్, కరాటే కోచ్ కె.నరేష్ తెలిపారు. ఈ మేరకు ప్రతిభ చూపిన విద్యార్థిని గురువారం కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

సారాతో వ్యక్తి అరెస్టు



సారా నిందితుడు రాజన్నతో ఎస్ఐ

భామిని: మండలంలోని కొత్తగూడకు చెందిన బిడ్డిక రాజన్న 80 లీటర్ల సారా తరలిస్తుండగా పట్టుకొని గురువారం అరెస్టు చేసినట్టు బత్తిలి ఎస్ఐ యతిరాజుల అమ్మనరావు తెలిపారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు కొత్తగూడ సమీపంలో మాటువేసి పట్టుకొన్నట్లు వివరించారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

ఏరియా ఆస్పత్రిలో ఆన్‌లైన్ టెలీ రేడియాలజీ సర్వీసులు



రేడియాలజీ రిపోర్టు చూపిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం మరో పరికరం అందుబాటులోకి వచ్చింది. ఇకపై ఆన్‌లైన్ టెలీ రేడియాలజీ సర్వీసులు రోగులకు అందనున్నాయి. గురువారం కృష్ణా డయాగ్నస్టిక్స్ ప్రతినిధులు దీన్ని ఇన్‌స్టలేషన్ చేశారు. ఆన్‌లైన్‌లో ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి ఎక్స్‌రే రిపోర్టు వస్తుందని ప్రాంతీయ ఆస్పత్రి సూపరెంటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఎటువంటి ఖర్చు లేకుండా ఈ సేవలందిస్తామన్నారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

పాలకొండ: పట్టణంలోని న్యూ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పౌష్టికాహార లోపంతో ఉన్న చిన్నారులకు పౌష్టికాహార కిట్లు గురువారం పంపిణీ చేశారు. క్రైస్ట్ ఫర్ ది లాస్ట్ ఇండియా సహకారంతో బాల బాలికలకు న్యూట్రిషన్ ఫుడ్ అందించామని పాస్టర్ ఐజక్ కలపాల బి ఎస్ బెన్హర్ తెలిపారు.

సామాజిక అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధికారులను కోరారు. ఈ మేరరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బి.రమణమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు నిర్వహించేందుకు రూ.3 కోట్లతో పనులు ప్రారంభించామన్నారు. ప్రారంభించిన పనులను పూర్తి చేయాలని పీఆర్ ఏఈ చంద్రమౌళికి ఎమ్మెల్యే సూచించారు. జల్‌జీవన్ మిషన్ నిధుల ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ చేపడుతున్న ఇంటింటి కుళాయిల పనులు పూర్తి కావచ్చిన అన్నిగ్రామాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీరు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఏఓ ఎస్.అవినాష్ మాట్లాడుతూ మండలంలోని ధాన్యం కొనుగోలు చేయడానికి 18 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వైద్యాధికారులు డాక్టర్ కె.శిరీష, డాక్టర్ రాధాకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాలు ప్రజల సహకారంతో విజయవంతం అయ్యాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, మండల ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ, ఇంజినీరింగ్ అధికా రులు పవన్‌కుమార్, జానకీరాం, విద్యాశాఖ అధికారి సూరిదేముడు, మండల పశువైద్యాధికారి డాక్టర్ రామారావు, ఆర్బీసీ, ఐసీడీఎస్, వెలుగు, ఉపాధి హామీపథకానికి చెందిన అధికారులు పాల్గొన్నారు.



డీసీసీబీ డైరెక్టర్ కష్ణంనాయుడుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

సీతానగరం: మండలంలోని వైఎస్సార్ సీపీనాయకుల కుటుంబసభ్యులను ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం పరామర్శించారు. ఈ మేరకు అంటిపేట గ్రామంలో డీసీసీబీ డైరెక్టర్ కృష్ణంనాయుడు కుటుంబంలో వరుసకు వదిన దీర్ఘకాలంగా వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లో మృతిచెందారు. హైదరాబాద్ నుంచి ఇక్కడికి వచ్చిన కృష్ణంనాయుడు కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. అలాగే అంటిపేట పంచాయతీ మాజీ సర్పంచ్ సిరికి మహేశ్వరరావు బావమరిది అకస్మాత్తుగా మృతిచెందడంతో వారికుటుంబాన్ని, రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతున్న చంటిని ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులు వెంపలి గుర్రాజు, మండల నాయకులు పి.ఈశ్వరనారాయణ, జెడ్పీటీసీ ఎం. బాబ్జీ, లచ్చయ్యపేట సర్పంచ్ సీహెచ్ కృష్ణ, కె.శ్రీనివాసరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, విదానబాబు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు ఆదేశించారు. ఆశ నోడల్ అధికారులతో జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాతా శిశు ఆరోగ్య కార్యక్రమాలు పూర్తి స్థాయిలో నిర్వహించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని చెప్పారు. ఆర్‌సీహెచ్‌లో మాతా శిశు ఆరోగ్య కార్యక్రమాల నివేదికల నమోదు, గర్భిణులకు మొదటి త్రైమాసికంలో త్వరితగతిన నమోదు, హైరిస్క్ గర్భిణులను గుర్తించి పర్యవేక్షణ, ఆరోగ్య తనిఖీలు నిర్వహించాలని సూచించారు. నవజాత శిశువుల గృహ సందర్శనను ఆశ కార్యకర్తలు విధిగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఐఓ టి.జగన్‌మోహన్‌రావు, నోడల్ అధికారి వినోద్ కుమార్, డీపీహెచ్ఎస్ ఉషారాణి, డీపీఓ లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

15న చలో విజయవాడ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పాలకొండ: సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 15న విజయవాడలో నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు దావాల రమణారావు కోరారు. ఈ మేరకు గురువారం దీనికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. సీపీఎం ప్రచార భేరి ముగింపు సభ విజయవాడలో చేపడుతున్నామని ఈ సభకు అన్ని వర్గాలు మద్దతు అందించాలని కోరారు. సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు పెత్త ఎత్తున చలో విజయవాడపై ప్రచారం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కె.రాము, బి.పట్టాభి, సీహెచ్ సంజీవి, పి.వేణు, బి.దర్గారావు పాల్గొన్నారు.

భవనాల నిర్మాణం వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రమౌళి

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో చేపడుతున్న సచివాలయ,ఆర్బీకే, వెల్‌నెస్, డిజిటల్ లైబ్రరీ భవనాల నిర్మాణం సకాలంలో నిర్వాహకులు పూర్తి చేసేవిధంగా ఇంజినీరింగ్ సహాయకులు కృషి చేయాలని మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రమౌళి కోరారు. ఈ మేరకు గురువారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు, భవన నిర్మాణం దారులతో అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కోట్లాది రూపాయల వ్యయంతో ప్రభుత్వ భవన నిర్మాణాలు జరుగుతున్నాయని తెలియజేశారు. ఇప్పటి వరకు పునాదుల నిర్మాణంతో అర్ధాంతరంగా నిలిచిపోయిన భవనాలు మినహా మిగతా భవనాలు గోడల స్థాయి నిర్మాణ దశలో ఉన్న వాటిని పూర్తి చేయాలని కోరారు. ఇప్పటికే పూర్తయిన సచివాలయం, రైతుభరోసా భవనాలను త్వరలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో ప్రారంభించడానికి నిర్వాహకులు సిద్ధం చేయాలని సూచించారు. కాశీపేట, పెద భోగిలి, సూరంపేట సచివాలయ భవనాల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయడం కోసం చర్యలు చేపట్టినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు, భవన నిర్వాహకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు



లుంబూరు జగనన్న కాలనీ వద్ద తాగునీటి బోరు తవ్విస్తున్న ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరు గ్రామంలో 24 కుటుంబాలకు సంబంధించి ప్రభుత్వ గృహ నిర్మాణాలకు స్థలం కేటాయించింది. ఇక్కడి జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పన యంత్రాంగం దృష్టి సారించింది. ఈ క్రమంలో గురువారం రూ.2లక్షల వ్యయంతో తాగునీటి బోరు ఏర్పాటును సర్పంచు తిర్లంగి ఉపేంద్రకుమార్, ఉప సర్పంచు పడాల రామచంద్రరావుల నేతృత్వంలో చేపట్టారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా ఈ బోరు తవ్వించటం జరిగిందని, త్వరలో విద్యుత్ సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు ప్రజా ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ తోడ్పాటు పట్ల గృహ లబ్ధిదారులు ఆనందం వ్యకం చేస్తున్నారు.


పాఠశాల పరిశుభ్రతపై అసంతృప్తి



అర్ధలి పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ సోంబాబు

పాలకొండ రూరల్: మండలంలోని అర్ధలి పాఠశాల పరిసరాల పరిశుభ్రత విషయంలో గ్రామస్తుల సహకారం అవసరమని ఎంఈఓ - 2 కె.సోంబాబు అన్నారు. సదరు పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. అక్కడి పరిసరాలు సక్రమంగా లేకపోవటంపై అసంతృప్తి వ్యక్తం చేసారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు బడి చేరుకునే రహదారిలో పూర్తిగా పారిశుద్ధ్య లోపం చోటుచేసుకుందన్నారు. గ్రామానికి చెందిన పాఠశాలను కాపాడుకోవాల్సిన క్రమంలో గ్రామస్తుల చొరవ చూపాలన్నారు. తమ పిల్లల ఆరోగ్యాన్ని, భద్రతను దృష్టిలో పెట్టుకుని సహకరించాల్సి ఉందన్నారు. కనీసం రహదరి లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించాలని కోరారు. ఉపాధ్యాయులకు గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు తోడ్పాటు అందిస్తే ప్రభుత్వ బడి మరింత మెరుగ్గా మారుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న సేవలు, బోధనపై ఆరా తీసారు. హెచ్ఎం వరలక్ష్మికి పలు సూచనలు చేసారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు.

అటవీ శాఖ ట్రెంచీలు ఆదుకుంటున్నాయి...



ట్రెంచీలలో నీరు తాగుతున్న ఏనుగుల గుంపు

భామిని: తివ్వాకొండల చుట్టూ అటవీ శాఖ ఆధ్వర్యంలో తవ్వించిన ట్రెంచీలు ఎట్టకేలకు ఉపయోగపడుతున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో తాగునీరు లేక కొండలు దిగి వచ్చిన ఏనుగుల గుంపు గొంతులు తడుపుకొంటున్నాయి. భామిని మండలం ఇసుకగూడ - సన్నాయిగూడల మధ్య కొండ దిగువన గల ట్రెంచీ గోతులలో చేరిన నీటితో ఏనుగులు సేద తీరుతున్నాయి. ట్రెంచీలు కొండ దిగువకు ఏనుగులు రాకుండా అడ్డుతున్నట్లు గిరిజనులు చెబుతున్నారు. ఏనుగులు ట్రెంచీల ఆవలే ఉన్న పంటలు, తోటలలో తిష్ట వేస్తున్నాయి.

రీ సర్వేను వేగవంతం చేయాలి



సుంకిలో రీసర్వేపై ఆరా తీస్తున్న జేసీ గోవిందరావు

గరుగుబిల్లి: జగనన్న భూహక్కు రీసర్వేను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని సుంకి రెవెన్యూ పరిధిలో నిర్వహిస్తున్న సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా సర్వేను నిర్వహించాలన్నారు. సర్వే నిర్వహిస్తున్న భూములకు సంబంధించి రైతులకు ముందుగానే సమాచారాన్ని అందించాలన్నారు. సర్వే నిర్వహణలో గ్రౌండ్ ట్రూత్ పక్కాగా ఉండాలన్నారు. పార్వతీపురానికి సంబంధించి 462 గ్రామాలకుగాను 368 గ్రామాల్లో రీసర్వే ప్రారంభం అయ్యిందన్నారు. రెండు విడతల్లో 147 గ్రామాల్లో సర్వేను నిర్వహించడం జరిగిందన్నారు. 94 గ్రామాల్లో అటవీ శాఖ, ఒడిశా సరిహద్దుల సమస్య ఉందని, ఈ ప్రాంతాల్లో సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపించడం జరుగుతుందన్నారు. మూడో విడతలో సర్వే ప్రారంభమైందన్నారు. సర్వే పూర్తయిన తరువాత సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పరిశీలనలో ఎంపీపీ ఉరిటి రామారావు, డివిజనల్ సర్వే అధికారి కె.సూర్యారావు, డీటీ శివున్నాయుడు, మండల సర్వేయర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్ఐటీఐలో స్వచ్ఛత కార్యక్రమం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో స్వచ్ఛత క్యాంపెయిన్ 3.0ను గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఇన్‌స్ట్రక్టర్లలతో కలిసి ఐటీఐ పరిసరాలను శుభ్రం చేశారు. పలుచోట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయన్నారు.

పంచగవ్య ద్రావణం తయారీ



మిర్తివలసలో తయారుచేస్తున్న ద్రావణం

బలిజిపేట: మండలంలోని మిర్తివలస గ్రామంలో గల బయో ఇన్‌పుట్ సెంటర్‌లో 200లీటర్ల పంచగవ్య ద్రావణాన్ని గురువారం తయారుచేసినట్లు ఎంసీఆర్‌పీ లక్ష్మి తెలిపారు. ఈ ద్రావణం తయారీకి 40కిలోల ఆవుపేడ, 40లీటర్ల ఆవు మూత్రం, నాలుగు కిలోల ఆవు నెయ్యి, 20లీటర్ల ఆవుపాలు, 20లీటర్ల ఆవు పెరుగు, 25లీటర్ల కొబ్బరినీరు, 20లీటర్ల కల్లు, 20లీటర్ల నీరు, 10కిలోల బెల్లం, బాగా మగ్గిన అరటిపళ్లు ఒక గెల ఉండాలని చెప్పారు. వీటన్నింటిని కలిపిన తరువాత మూడు నుంచి నాలుగు వారాల్లో ద్రావణం తయారవుతుందన్నారు. తయారైన పంచగవ్యను పండ్లతోటల్లో, కాయగూర మొక్కల్లో 100లీటర్ల నీటిలో ఆరు లీటర్లు కలిపి స్ప్రే చేయడం వల్ల అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. నాణ్యత బాగుంటుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు కచ్చితంగా అమలు చేయాల్సిందే

- డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు



ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేస్తున్న డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాల్సిందేనని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన తన వైద్యబృందంతో కలిసి పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిబంధనలు ఏ మేరకు ఆస్పత్రిలో అమలవుతున్నాయో పరిశీలించారు. ఆస్పత్రిలో నమోదవుతున్న ఔట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్ రోగుల రికార్డులు, వారికి అందజేస్తున్న చికిత్సను పరిశీలించారు, ల్యాబ్,పరికరాలు నిర్వహిస్తున్న పరీక్షలు, రుసుము(ఫీజు)ల వివరాలు రికార్డులో తనిఖీ చేసి వివరాలు స్పష్టంగా ఉండాలని చెప్పారు. రోగులు వేచి యుండు ప్రదేశం, వాటి నిర్వహణ పరిశీలించారు. ఆస్పత్రి రెన్యువల్ గడువు తేదీలను పరీక్షించారు. ఆస్పత్రిలో వ్యర్థాలకు బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పక్కాగా నిర్వహించి తొలగించాలని సూచించారు. ఆరోగ్య సూచనలు తెలియజేసే పోస్టర్స్ ఉండాలని చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ డెమో వై.యోగీశ్వరరెడ్డి, సూపర్‌వైజర్ జయగౌడ్ తదితరులు ఉన్నారు.

సీస్ టెస్ట్ పకడ్బందీగా నిర్వహించాలి : డీఈఓ



కేజీబీవీలో సీస్ ప్రాక్టీస్ పరీక్షను పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థుల్లో దాగి ఉన్న అభ్యాసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు శుక్రవారం నిర్వహించే సీస్ (స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్) టెస్ట్‌ను పకడ్బందీగా నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ అన్నా రు. గురువారం ఆయన మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు కొత్తగూడ జీటీడబ్ల్యూఏహెచ్ స్కూల్ (బాలురు), కేడీ కాలనీ జీటీడబ్ల్యూఏహెచ్ స్కూల్(బాలికలు), భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ గరల్స్, బాయ్స్ స్కూల్స్, టిక్కబాయి జీటీడబ్ల్యూఏహెచ్ స్కూల్ (బాయ్స్), ఏకలవ్య ఆదర్శ గురుకుల బాలబాలికల పాఠశాలలను సందర్శించారు. సీస్ పరీక్షలో పాల్గొనేందుకు సిద్ధమైన 3, 6, 9 తరగతుల విద్యార్థులు రాస్తున్న ప్రాక్టీస్ పరీక్షలను పరిశీలించారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో నిర్వహించే సీస్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలకు ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓ బి.చంద్రశేఖర్ ఉన్నారు.

పనులు పరిశీలించిన ఇంజినీర్లు



ఏకలవ్య స్కూల్ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఈఈ సింహాచలం, డీఈఈ కృష్ణమోహన్

భామిని: గిరిజన ప్రాంతాల్లో గిరిజన సంక్షేమ శాఖ పర్యవేక్షణలో జరుగుతున్న రహదారి నిర్మాణ పనులు, ప్రతిపాదిత పనులను టీడబ్ల్యూడీ ఈఈ ఎం.సింహాచలం పర్యవేక్షణలో ఇంజినీర్లు గురువారం పరిశీలించారు. మండలంలో కొనసాగుతున్న నిర్మాణ పనులు గుర్తించారు. డీఈఈ కృష్ణమోహన్‌తో కలిసి భామిని ఏకలవ్య గిరిజన మోడల్ స్కూల్ భవనాలకు వెళ్లే దారికి సుమారు రూ.40లక్షల వ్యయం కాగల రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించారు. నాణ్యతా లోపాలు లేకుండా చేపట్టాలన్నారు. మండల కేంద్రంలోని ఆస్పత్రి భవనం, మురుగునీటి కాలువ, తాలాడలో రూ.15లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ కాలువ, మూలగూడ రోడ్డు, డోకులగూడ రోడ్డు పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఏఈ సత్యనారాయణ, డబ్ల్యూఐ సీహెచ్ భీష్మ ఉన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై వినతి

గుమ్మలక్ష్మీపురం: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి అక్టోబర్ 30వ తేదీన అమరావతిలో ఏపీవైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్పలత తదితరులతో కలిసి వినతిపత్రం అందజేసినట్లు పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌టీఎఫ్ అధ్యక్షుడు ఎం.సీతన్న తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేస్తున్న ఫేషియల్ యాప్‌కు సంబంధం లేకుండా జీతాలు చెల్లించాలని, వృత్తి విద్యా బోధకుల పెన్షనరీ బెనిఫిట్స్ అమలుపర్చాలని, జీతాలు ఒకటో తేదీకే ఖాతాల్లో జమ చేయాలని, ఐటీడీఏ పరిధిలో పని చేస్తున్న భాషా, వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేసారన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని పేర్కొనట్లు సీతన్న తెలిపారు.